# 'చదువుల వీరరాఘవయ్య'

కొందరు అసామాన్యమైన వ్యక్తులు సామాన్యంగా కనిపిస్తూ మనమధ్యనే తిరుగుతుంటారు. యాంత్రిక జీవితంలో పడి కొట్టుకుంటూ మన అస్తిత్వాలను మనమే మరచిపోతూంటాము. ఇక అలాంటివాళ్ల అస్తిత్వాలను మనం గుర్తించేదెప్పుడు? గుర్తిస్తాం... ఉన్నట్టుండి ఓ రోజున ఆ సామాన్యంగా కనిపించే వ్యక్తులు చేస్తున్న అసామాన్యమైన పనులు మనకు విదితమైనప్పుడు.. అదుగో అట్లాంటి అసామాన్యమైన వ్యక్తిత్వం కలిగిన ఉత్తములు వీరరాఘవయ్యగారు... 'వీర' శబ్దానికి అర్థం మనందరికీ తెలుసు. 'రాఘవం' అంటే తిమింగిల గిలగిలమనే పెద్ద చేప అని నిఘంట్వర్థం. తిమింగిలమంటేనే పెద్ద చేప. దాన్ని మింగే చేప తిమింగిల గిలము... దాన్ని కూడా మింగేది రాఘవం. అట్లా తిమింగిల గిలంలాంటి భయానక కష్టాలను మింగేసిన వ్యక్తి వీరరాఘవయ్యగారు.

ఇరవై దశకపు పూర్వార్థంలో గోవిందశాస్త్రి మీనాక్షమ్మ దంపతులకు జన్మించారు. చుట్టుపక్కల మూడు గ్రామాల్లో పాఠశాల లేక తల్లి ఒడిలోనే మౌలిక పాఠాలు నేర్చుకున్నారు. పన్నెండేండ్ల చిరుత వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయారు. అమ్మమ్మ రామమ్మగారు చేరదీసి తనకు వీలైనంత మేరా చదువు చెప్పించారు. బంధువులు ఆస్తి హరించారు.

ఆయన ప్రాథమిక విద్యనించీ ఇంటరు వరకూ తిరుపతి క్షేత్రం చుట్టూవున్న వడమాల, కాళహస్తి, చంద్రగిరులలో సాగింది.

రాఘవయ్యగారికి విద్య తప్ప మరోదారి లేదు... చదవాలి... స్తోమత లేదు. కానీ చదివి తీరాలి. బంధువుల నిరాదరణ... అమ్మమ్మ రామమ్మగారి అసహాయత... చదువు ఉచితంగా చదువుకోవచ్చు. మరి భోజనం? పూట గడవని స్థితి. అమ్మమ్మ చేతులెత్తేసి 'నాయినా రాఘవయ్యా ఇక నాచేత కాదురా... ఈ డబ్బు తీసుకుని చెన్నపట్నం వెళ్లు... అక్కడ కృష్ణస్వామిగారిని కలువు, ఆయన నీ బాగోగులు చూస్తారు' అని చేతిలో డబ్బు పెట్టిందా తల్లి.

ఆ డబ్బు రెండు రూపాయలు.

రాఘవయ్యగారు ఆ రెండు రూపాయలు తీసుకుని మద్రాసు మహానగరానికి చేరుకున్నారు. అక్కడ సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ ప్రముఖ న్యాయమూర్తి అల్లాడి కుప్పుస్వామి గారి తండ్రిగారిని కలిశారు.

బి.ఏ. వరకూ చదువు చెప్పిస్తానన్నారు.

బి.ఏ. పట్టా చేతికొచ్చిం తర్వాత 'ఇక అబ్బాయ్ నీ దారి నువ్వు చూసుకోవాలి' అని చెప్పేసారు. లా చదవాలనుకున్న రాఘవయ్యగారు చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ చివరికి టీచర్‌గా స్థిరపడ్డారు. బ్రాహ్మణ కుటుంబాల్లోని హిపోక్రసీ వారిని బాధించింది. పేదరికం హింసించింది. చదువుకున్న విలువ జీవితం నేర్పింది. నేర్చుకున్న చదువు మొక్కవోని ఆత్మస్థైర్యాన్నిచ్చింది. తను ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత ఏం చేయాలో యువకులైన రాఘవయ్యగారు నిర్ణయించుకున్నారు. తన ఏడుగురు పిల్లలకు ఏమిచ్చినా ఏమివ్వకపోయినా అందరికీ మంచి విద్య అబ్బేట్టు చూసారు. తిరుపతిలో సంసారం మొదలుపెట్టిన కొత్తలో ఊరికి దూరంగా చిన్న ప్లాటుకొని అందులో పాక వేసుకు బతికారు. ఆయన సంతానం ఇప్పుడు సంఘంలో ఉన్నతమైన విలువలు కలిగిన జీవితాలు జీవిస్తున్నారు. చివరికి హెడ్మాస్టరుగా రిటైరయ్యారు.

రిటైర్మెంటు డబ్బు బాగానే వచ్చింది. ఆయన సంతానంలో ఎవ్వరూ ఆ ధనాన్ని ఆశించలేదు. రాఘవయ్యగారు పుదూరు ద్రావిడ బ్రాహ్మలు... ఆ బ్రాహ్మణ సంఘం వాళ్లు మాత్రం వచ్చి సంఘానికి చందా ఇవ్వమని కూచున్నారు. 'నేను చందా ఇవ్వను... ఇచ్చి కులాలను ప్రోత్సహించను' అనేసారు. ఆ తర్వాత రాఘవయ్యగారు ఓ మహోత్కృష్టమైన కార్యం చేపట్టారు. అది విద్యా దానం... తను వ్యక్తిగతంగా విద్యార్జనకు పడిన నానా కష్టాలనూ, అవమానాలనూ ఆయన ఎన్నడూ మరువలేదు. అలాంటి కష్టాలున్న విద్యార్థినీ విద్యార్థుల్ని కుల, మత భేదం లేకుండా చేరదీసారు. వాళ్లకు భోజనం బసలతో పాటు అన్ని ఏర్పాట్లూ చేసారు. ఇప్పటికీ ఈ రోజుకీ ఎనభై ఏళ్ల వృద్ధాప్యంలో కూడా ఆయన ఓ ఏడుగురు విద్యార్థుల్ని చేరదీసి, వారి బాధ్యతల్ని మీద వేసుకుని చదివిస్తున్నారు. ఇప్పటికీ తిరుపతిలో వారిని చూడవచ్చు. ఆయన్ని చూసిం తర్వాత ఊరికి ఒక్క వీరరాఘవయ్య వుంటే చాలుకదా అని అన్పించక మానదు. నాలుగున్నర అడుగులెత్తు మనిషి...నలభై యోజనాలెత్తు వ్యక్తిత్వం. వీరరాఘవయ్యగారూ శిరసా నమామి. ●

*ఈ పుస్తకం వెలువడ్తూన్న సమయానికి వీరరాఘవయ్యగారు స్వర్గస్తులయ్యారు.*